

శిల్పం నిప్పులు తొక్కిన కోత వంటిది కాదు...
మదించిన ఏనుగు వంటిది.
- శ్రీ విశ్వానాథ సత్యనారాయణ


# జనస్వరం

అక్షరమే ఆయుధం

www. Janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.

సంపుటి : 01 | సంచిక : 27 | ఎడిటర్ : నరేష్ సాకే | వారసంచిక ( 10-01-2021 ) | పేజీలు : 6

/ janaswaramNEWS / 9642067900


## దివీస్ ఆపేది లేదు... ఎవరు అడ్డొస్తారో చూస్తాం అని జగన్ రెడ్డి గారు ఛాలెంజ్ చేస్తారా ?

### అప్పుడు బంగాళాఖాతంలో కలిపేస్తా అన్నారు... ఇప్పుడు అనుమతినిచ్చారు

### ఇదేం రాజకీయం -- ఇవేం విలువలు   అరెస్టు చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలి



న్యూస్ ( జనస్వరం ) : పాదయాత్ర సమయంలో దివీస్ పరిశ్రమను బంగాళాఖాతంలో కలిపేస్తాం అని చెప్పి... అధికారంలోకి రాగానేపరిశ్రమనిర్మాణానికి అనుమతులు ఇవ్వడం ఏం విలువలతో కూడిన రాజకీయమో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారే చెప్పాలని జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రశ్నించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఈ ప్రాంతంలో రానివ్వమని జగన్ రెడ్డి గారు ఇచ్చిన మాటను, నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాదుకూడదు పరిశ్రమను ఏర్పాటు చేస్తాం, ఎవరడ్డొస్తారో చూస్తామని ముఖ్యమంత్రి ఛాలెంజ్ చేస్తారా... అలా చెబితే ఎలా ఎదుర్కోవాలో మాకు బాగా తెలుసని అన్నారు. మరోసారి ఈ ప్రాంతానికి వస్తాను అని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా తొండంగి మండలం కొత్తపాకలలో దివీస్ ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారికి మద్దతుగా శనివారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రసంగిస్తూ... "ఎన్నో ఏళ్లు మధించి, దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకొని, వర్తమాన కాల పరిస్థితులను అర్ధం చేసుకొని పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం అనే సిద్ధాంతాన్ని జనసేన పార్టీ మూల సిద్ధాంతాల్లో పెట్టాం. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తిని నేను. తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 50 లక్షల మంది వరకు జనాభా ఉంది. ఈ ప్రాంతంలో చాలా పరిశ్రమలు రావాలని కోరుకుంటాం. పర్యావరణానికి కొంత ఇబ్బంది కలుగుతుంది. అయితే అది ఏ స్థాయిలో అన్నదే మనం ఇక్కడ ప్రశ్నించుకోవాలి మన బిడ్డలకు వారసత్వంగా ఆస్తులు, పొలాలు, బంగారం ఇవ్వగలం. కానీ ఆరోగ్యాన్ని ఆస్తిగా ఇవ్వలేం పీల్చే గాలి, తాగే నీరు కలుషితమై అనారోగ్యానికి గురైతే... మనం ఎన్ని ఆస్తులు ఇచ్చినా వాళ్లు అనుభవించలేరు. ఈ భూమి ఎవరి సొంతం కాదు. సగటు మనిషి జీవిత కాలం 64 ఏళ్లు. ఈ 64 ఏళ్లు ఈ భూమి మీద సక్రమంగా జీవించి, భావితరాలకు పదిలంగా అప్పగించాలి. వేల కోట్లు, వందల ఎకరాలు, ఖరీదైన ప్రాంతంలో ఇళ్లు కట్టి పిల్లలకు ఇస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని వైసీపీ నాయకులు అనుకుంటే పొరపాటే. విశాఖపట్నంలో స్టరీన్ గ్యాస్ లీక్ అయినపుడు డబ్బున్నవాడి మీద, పేదవాడి మీద ఒకేలా పనిచేసిందని గుర్తుంచుకోవాలి. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారు, వైసీపీ ప్రజాప్రతినిధులు నాకు శత్రువులు కాదు. విధానాలు సరిగా లేనప్పుడు కచ్చితంగా బయటకు వచ్చి ( మిగతా 5 లో )

## జనసైనికుల సహకారంతో నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణం, గృహ ప్రవేశానికి అతిథులుగా పార్టీ కార్యదర్శులు





ఎచ్చర్ల ( జనస్వరం ) : జి.సిగడాం మండలం మధుపం గ్రామంలో జనసైనికులు ఆర్థిక సహకారంతో ఒక పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర గారు, పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్య గారు, రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు వన్నె రెడ్డి సతీష్ కుమార్ గారు, ఉత్తరాంధ్ర జనసేన బిజెపి సమన్వయ సభ్యులు రామ్మోహన్ గారు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జి. సిగడాం మండల జెడ్పిటిసి అభ్యర్థి భూపతి అర్జున గారి ఆధ్వర్యంలో శివశంకర్ గారి చేతుల మీదగా ఆ గృహానికి రిబ్బన్ కటింగ్ చేయడం జరిగింది. బొలిశెట్టి సత్య గారు, సతీష్ గారు రామ్మోహన్ గారు కొబ్బరికాయ కొట్టి ఆ కుటుంబాన్ని ఆ నూతన గృహంలో కి ఆహ్వానించడం జరిగింది. ఎవరికి ఏం కష్టం వచ్చినా అండగా ఉంటామని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఆ కార్యక్రమం అనంతరం రామతీర్థం క్షేత్రాన్ని జనసేన పార్టీ నాయకులు సందర్శించడం జరిగింది.

## 73 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో కూడా త్రాగడానికి నీరు దొరకక పోవడం చాల సిగ్గుచేటు : ఆలూర్ ఇంచార్జ్ వెంకప్ప



ఆలూరు ( జనస్వరం ) : కరోనా మహమ్మారి దృష్ట్యా చాల రోజులు తర్వాత నియోజకవర్గ పర్యటన నిర్వహించిన కర్నూల్ జిల్లా ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు శ్రీ తెర్నెకల్ వెంకప్ప గారు. ఈ రోజు పర్యటనలో భాగంగా ఆలూరు మండలం హులేబీడు గ్రామ పరిధిలో త్రాగునీటి సమస్య గురించి మహిళాలతో వారు మాట్లాడుతూ, ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ గుమ్మనూరు జయరాం గారికి సవాల్ చేస్తు, ఈ నీటి సమస్య పరిష్కార మార్గానికి 4 వారలు గడువు ఇస్తున్నాము. ఆ లోపు సమస్య పరిష్కారించకపోతే ఆలూరు నియోజకవర్గ ముఖ్య కూడలిలో ధర్నా నిర్వహించి, అక్కడ కూడా పరిష్కారించకపోతే, కర్నూల్ జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యే దిశగా చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా మహిళల సమస్యలు, కష్టాలు పరిష్కరించని నాయకులు మీరేమో నాయకులని హెచ్చరించారు. గతంలో ఎన్నోసార్లు ఈ ప్రాంత సమస్యల గురించి అధికారులకి వివరించాము. ఈ సమస్య పరిష్కారానికి మీరు కూడా మీ గొంతు విప్పి అధికారులకు, నాయకులకు ప్రశ్నించాలని అక్కడున్న మహిళలను,యువకులను కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు బడేసబ్, మగ్బుల్, నందు, నాగరాజు, రామలక్ష్మణ్, చిన్నపెద్దాయ్య, రవి, సంజు, చిరంజీవి, నారసప్ప, అంజి, గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో యాసిడ్ బాధితురాలు అపర్ణకు మొరుగైన వైద్యం అందించాలని రిలే నిరాహార దీక్ష



విశాఖపట్నం ( జనస్వరం ) : పెందుర్తి నియోజకవర్గం విశాఖపట్నం జిల్లా యాసిడ్ బాధితురాలు అపర్ణ కుటుంబం ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించడంలో విఫలమైంది కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మండల పరిషత్ వద్ద 8 రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో జనరల్ సెక్రటరీ శ్రీ తమ్మి రెడ్డి శివ శంకర్ గారి పిలుపు మేరకు పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ నుంచి మద్దతు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో 88 వార్డ్ కార్పొరేట్ అభ్యర్థి శ్రీ వబ్బిన జనార్దన శ్రీకాంత్ గారు మాట్లాడుతూ ఈ ఒక్క వైయస్ఆర్సీపీ ప్రభుత్వం మొద్దు నిద్ర వదలాలని పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అదీప్ రాజు గారు వెంటనే స్పందించి అపర్ణ కార్పొరేట్ వైద్యం అందించాలని కోరడం జరిగింది. 95 వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి కంచిపాటి మధు మాట్లాడుతూ సమస్య ఎక్కడ ఉంటే అక్కడ జనసేన పార్టీ అండగా ఉంటుందని అదే స్ఫూర్తితో అపర్ణ కుటుంబానికి మా వంతు ఆర్థిక సాయం అందించామని ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండాలని అని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. సబ్బవరం మండల నాయకులు మామిడి శంకరరావు గారు మాట్లాడుతూ హాస్పిటల్లో వైద్యం చేయవలసిన అపర్ణ ఆర్థిక స్థోమత లేక గత మూడు నెలల నుంచి ఇంటి వద్ద ఉందని రేపు అపర్ణ ప్రాణాలు వదిలినట్లయితే ఈ యొక్క ( మిగతా 3 లో )

## సంపాదకీయం

"దివీస్ మాకొద్దు – పర్యావరణమే ముద్దు "

దివీస్ కొత్త యూనిట్. దిగ్గజ ఫార్మా సంస్థల్లో ఒకటైన దివీస్ లాబొరేటరీస్ తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి వద్ద తమ మూడో యూనిట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు ను ఏర్పాటు చేసుకుంటున్న ఎన్నో అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి తొండంగి వద్ద రూ.1500 కోట్ల వ్యయంతో కొత్త యూనిట్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే హైదరాబాద్ . దీనితో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాలు, విశాఖపట్నం సమీపంలోనూ యూనిట్లు నడుపుతున్న దివీస్ ఫార్మా ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గంలో ఈ ప్రతిష్టాత్మక యూనిట్ నిర్మాణానికి పావులు కదుపుతోంది. ఈ ఫార్మా సంస్థ విస్తరణ కోసం కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రయత్నాలను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా.. విపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన వైసీపీ ఇప్పుడు సమర్థిస్తోంది. అలాగే అధికారంలో ఉన్నప్పుడు సమర్ధించిన టీడీపీ ఇప్పుడు వ్యతిరేకిస్తోంది. దీంతో వైసీపీ, టీడీపీ డబుల్ గేమ్‌పై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తాజాగా టీడీపీ నేత యనమల రామకృష్ణుడు వైసీపీ ప్రభుత్వం దివీస్ ఫార కు మద్దతుగా చేస్తున్న చర్యలను వ్యతిరేకిస్తామని ప్రకటించారు. ఇక్కడ భూసేకరణకు జరిగే చర్యలు స్థానికుల్లో ఆందోళనలు రేపుతుంటే, వీరికి జనసేన శ్రేణులు మరియు ప్రజా సంఘాలు మద్దతు నిలుస్తూ పోరాటం చేస్తున్నాయి. అధికారం అండదండలతో బలవంతంగా భూమిని సేకరించి ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

### రాజకీయ నాటకాలు :

వైసీపీ, టీడీపీ పిల్లిమొగ్గలు.. గతంలో విపక్షంగా ఉండగా ఎట్టి పరిస్థితుల్లోనూ దివీస్ ఫార్మా ఏర్పాటు కాకుండా చూస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ఇప్పుడు అధికారంలోకి రాగానే దానికి మద్దతిస్తోంది. అలాగే గతంలో అధికారంలో ఉండగా దివీస్ ఫార్మా ఏర్పాటును సమర్ధించిన టీడీపీ ఇప్పుడు వైసీపీని టార్గెట్ చేస్తూ విమర్శలకు దిగుతోంది. ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లాలో ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదనలు చేస్తున్న నేపథ్యంలో దివీస్ ఫార్మా ఏర్పాటు వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని స్థానికులు, మరియు జనసేన నాయకులు అనేక పర్యాయాలు ధర్నాలు మరియు రాస్తారోకలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం నిరంతరం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే AP CM జగన్ గారు డిసెంబర్ 7 వ తారీఖున దివిస్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి పూనుకోగా అక్కడ స్థానికుల్లో మరొక్కసారిYSRCP ప్రభుత్వంపై తమఅసహనాన్నివ్యక్తంచేస్తునిరసనలుచేశారు. 60:40 భాగస్వామ్యం కింద అప్పటి ప్రభుత్వం టిడిపి మరియు ఇప్పటి ప్రభుత్వం YSRCP తో దివిస్ యజమాన్యం సత్సంబంధాలు కలిగి ఉండటం వలన, ప్రభుత్వంలో ఏ పార్టీ వారు ఉన్న దివిస్ పరిశ్రమకు ఆటంకాలు రాకుండా అనుమతులుఇవ్వాలనివారిఅంతర్గతఒప్పందాల్లో భాగంగా తెలుస్తుంది. దీనిని జనసేన నాయకులు మరియుజనసేనఅధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు గుర్తించి పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు.

### స్థానికుల మాట ఏంటి ? :

రాష్ట్ర ప్రభుత్వాలే వరుసగా మాకు వ్యతిరేకంగా వెళుతున్నప్పుడు మేం చెయ్యాల్లో పాలుపోవడంలేదు దిక్కుతోచని స్థితిలో ఉన్నాం, మాలో ఓ 10మంది చద్దాం అనుకుంటున్నాం

# దివీస్ సమస్యపై పూర్తి సమగ్ర విశ్లేషణ సమాచారం




అని కంట తడి పెట్టుకున్నారు. మాజీ స్పీకర్ శ్రీ యెనుమల రామకృష్ణుడు, అతని సోదరుడు మరియు జిల్లా పరిపాలన వ్యవస్థ 2016 లో దివిస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి అంగీకరించామని మమ్మల్ని బలవంతం చేసిన కథను గ్రామస్తులు చెప్పారు. తరువాత జగన్ మోహన్ రెడ్డి గారు తమ మండలంలో బహిరంగ సభలో మాట్లాడుతూ "చంద్రబాబుకి బుద్ధి లేదు ఈ సున్నితమైన ఆక్వా జోన్‌లో ఈ కాలుష్య తయారీ యూనిట్‌ను ఎలా అనుమతిస్తారు? ఈ యూనిట్ 55లక్షల లీటర్ల కలుషిత నీటిని సముద్రంలోకి విడుదల చేస్తుంది. దానివల్ల చేపలు మరియు రొయ్యలు నశించిపోతాయి మరియు మీ గ్రామాల ప్రజలు జీవనోపాధిని కోల్పోతారు, మహిళలకు పిల్లలు పుట్టరు, ఇది మానవులతో పాటు సముద్ర జీవులకు కూడా ప్రమాదం కలిగిస్తుంది" అన్నారు. అతనిని విశ్వసించి 2019లో ఆయనకు ఓటు వేశారు, కానీ జగన్ మోహన్ రెడ్డి గారు సీయం అయ్యాక , తన వాగ్దానం మరచిపోయి పోలీసుల శక్తితో తొండంగిలో ఆ విషపు యూనిట్‌ను ఏర్పాటు చేయమని దివిస్ ను ప్రోత్సహిస్తున్నాడు. ఇది దారుణం అన్నారు. తల్లి పాలు త్రాగి రొమ్ము గుద్దినట్టే అని వాపోయారు. ఆ గ్రామం నుంచి వచ్చిన శ్రీమతి నాగ కృష్ణవేణి "జగనన్నా నా నెత్తిమీద చెయ్యి వేసి ప్రమాణం చేసావు, ఈ విషం కక్కే ఫ్యాక్టరీని బంగాళాఖతంలో కలిపేస్తానన్నావు.. మర్చిపోయావా, నీ స్పీచ్ ఒకసారి చూడు గుర్తు తెచ్చుకో మాకు న్యాయం చెయ్యి.. ఫ్యాక్టరీని వదిలి మమ్మల్ని బంగాళాఖతంలో కలపక" అని రోదించింది.

### జగన్ ఎందుకు మాట మారుస్తున్నాడు ? :

నాటి ప్రతిపక్ష, వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం అధ్యక్షుడు, "తొండంగి మండలం దానవాయిపేట పంచాయితీ పరిధిలోని కొత్తపాకాల సమీపంలో దివిస్ పరిశ్రమ ఏర్పాటుకు నాడు 2016 సంవత్సరంలో నవంబర్ 21 తేదీన రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో ఓదార్పు యాత్రలో భాగంగా అక్కడకు వెళ్లిన అప్పటి ప్రతిపక్షనేత శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో, దివిస్ పరిశ్రమ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించి చెప్పు 'మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే, దివిస్ పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటానని హామీ' ఇచ్చారు. ఇపుడు అధికారంలోకి వచ్చి మాట మారుస్తున్నారు. మాట తప్పను మడమ తిప్పను అని గొరఖాలు పలికే వ్యక్తి ఇపుడు ఎందుకు మూగబోయాడు. ఏమైనా సూట్ కేస్ లు ముట్టాయా ??

### జనసేన పోరాటం :

60:40 భాగస్వామ్యం కింద అప్పటి ప్రభుత్వం టిడిపి మరియు ఇప్పటి ప్రభుత్వం YSRCP తో దివిస్ యజమాన్యం సత్సంబంధాలు కలిగి ఉండటం వలన, ప్రభుత్వంలో ఏ పార్టీ వారు ఉన్న దివిస్ పరిశ్రమకు ఆటంకాలు రాకుండా అనుమతులు ఇవ్వాలని వారి అంతర్గత ఒప్పందాల్లో భాగంగా తెలుస్తుంది. దీనిని జనసేన నాయకులు మరియు జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు గుర్తించి పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. ఫార్మా పరిశ్రమలు అనేవి జనవాసంలో కాకుండా ఫార్మా హబ్ లలో ఏర్పాటు చేయాలని, ఇలా జనవాసంలో ఏర్పాటు చేస్తే కలిగే నష్టలెంటో అని పలుమార్లు విన్నవించారు. చెవిటి వాణి ముందు శంఖం ఉదినట్లు అప్పటి టిడిపి వారు, ప్రస్తుతం YSRCP ప్రభుత్వం వారు ఒకరి మీద ఒకరు తోసుకుంటూ కిమ్మనకుండా మొత్తం తతంగాన్ని నడిపిస్తున్నారు. రైతులను ఉద్దేశించి జనసేన ప్రధాన కార్యదర్శి శ్రీ తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ GO నెంబర్ 1307/23.12.1993 ప్రకారం, D పట్టా భూములను ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే తీసుకోవచ్చు, కేటాయించిన భూములకు పరిహారం చెల్లించే విధానం కూడా ఉంది. అలాకాకుండా జులుం చేస్తే జనసేన వారికి అండగా ఉంటుంది. ఈ గ్రామాలన్నిటి జీవనోపాధిని కాపాడటానికి మరియు ఆ ప్రాంతంలో జల జీవనాధారాలను కాపాడటానికి అన్ని చట్టపరమైన సహాయం చేస్తుంది, ఈ జోన్‌ను ఆక్వా జోన్‌గా ప్రకటించే వరకూ వారి తరపున పోరాడతానని ఆయన తొండంగి మండల గ్రామస్తులకు కాలుష్యరహిత సముద్ర సంబంధిత యూనిట్లు మాత్రమే అక్కడ ఏర్పాటు చేయబడతాయి హామీ ఇచ్చారు. జనసేన పర్యావరణ కార్యదర్శి బోలిసెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, భీమిలిలో ఉన్న దివిస్ యూనిట్ ఇప్పటికే సముద్ర జీవులకు, మత్స్యకారుల జీవనోపాధికి ముప్పుగా మారిందని, క్రమబద్ధీకరించని కాలుష్యంతో 16 గ్రామాలు ప్రభావితమయ్యాయని చెప్పారు.

### పర్యావరణం దృష్ట్యా దివీస్ :

అందం వెనుక ప్రమాదం ఎలా దాగుంటుందో అలాగే ప్రకృతి వనరులు సంవృద్ధిగా ఉన్న చోట అవకాశవాదులు, ధనమే పరమావధిగా భావించే రాజకీయ నాయకులు మరియు వ్యాపారస్తులు దానిని వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని నిరంతరం ప్రయత్నిస్తుంటారు. వీరు ప్రకృతి, ప్రజల ఆరోగ్యం గురించి ఏమాత్రం ఆలోచించకుండా ఏకపక్ష నిర్ణయాలతో మొండిధోరణితో అధికారం అడ్డం పెట్టుకొని వ్యవహరిస్తారు. ఏదైనా ఒక ప్రాంతం నివాసయోగ్యంగా ఉండాలంటే కనీసం అక్కడ కలుషితం లేని నీరు, కలుషితం లేని గాలి తదుపరివి ఉండాలి. దివిస్ కాలుష్య కోరల్లో ప్రజలు, పంటలు, భూగర్భ జలాలు... ఒకటేమిటి ఆ చుట్టూ పక్కల పల్లెల ప్రజలు నివసించడానికే అత్యంత ప్రమాదకర స్థాయిలోకి నెట్టబడతరు. పుష్కల ప్రకృతి వనరులే వారి పాలిట శాపం అయ్యాయి నేడు. తొండంగి మండలం మరియు చుట్టుప్రక్కల ప్రజల అభ్యర్థనలు, గోడు నేడు అరణ్యరోదనను తలపిస్తుంది. తిలా పాపం తల పిడికెడు అన్న చందంగ టిడిపి మరియు వైఎస్ఆర్‌సిపి వ్యవహరించాయి.

ఉన్న రోగాలకు మందులు తయారు చేస్తామని చెప్పి పరిశ్రమలు ఏర్పాటు చేసి కొత్త రోగాలకు తావిచ్చి, ఆ గ్రామాల అమాయక ప్రజలు "ఎందుకు చనిపోతున్నారో? ఎందుకు అంగవైకల్యంతో పుడుతున్నారో? ఎందుకు శరీరంలో ఎదుగుదల ఆగిపోతుందో? ఎందుకు వారి చెట్లు మాడిపోతున్నాయో? మొలకెత్తిన పంట ఎందుకు రాలిపోతుందో? ఎందుకు నీరు తాగడానికి పనికిరావడం లేదో" తెలియక వారి బతుకులను అగమ్యగోచరం చేస్తున్నారు ఈ పరిశ్రమల పెద్దలు మరియు వీరికి వెన్నంటుండే రాజకీయ నాయకులు. ఆ గ్రామాల ప్రజల జీవితలనే ప్రశ్నార్థకం చేసే అభివృద్ధి, అభివృద్ధి అని పిలవబడదు.

విశాఖ తీరంలో ఉన్న దివిస్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే విషవాయువుల వలన వేలాదిమంది అమాయకుల ప్రజలు పండుటాకు వలె రాలిపోతున్నారు. కాలుష్య నివారణ కంటే కాసులే ముఖ్యమైపోయాయి నేటి రాజకీయ ప్రతినిధులకు మరియు వ్యాపారస్తులకు. ఈ సంఘటన నుండి నుండి తొండంగి మండలం మరియు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు చైతన్యం అయ్యి దివిస్ పరిశ్రమ ఏర్పాటైతే త్వరలోనే రాబోయే విపత్తులను గ్రహించి, ముందునుండి దివిస్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వస్తున్నారు జనసేనాని శ్రీ పవన్ కళ్యాణ్ గారు.

By
కొన్నిపాటి రవి
ట్విట్టర్ ఐడి : @KPR_India

విశాఖలో యాసిడ్ బాధితురాలు అపర్ణకు మెరుగైన వైద్యం అందించాలని రిలే నిరాహార దీక్ష

( మొదటి పేజీ తరువాయి )

ఈ యొక్క ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్.కోట నియోజకవర్గం నాయకులు వబ్బిన సతీష్ గారు మాట్లాడుతూ రెండు రోజులో అపర్ణ కు కార్పొరేట్ వైద్యం అందిస్తాం అని చెప్పిన పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే నెల రోజులు గడుస్తున్నా కుటుంబం చేస్తున్న స్పందన కరువైందని పెందుర్తి ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి అపర్ణ సమస్యను మీయొక్క ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకుని వెళ్లి మరుగైన వైద్యం అందించడంలో చొరవ తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో నాయకులు మెంద సతీష్ గారు మోటూరు చైతన్య గారు, నల్ల వలస శ్రీను గారు, అల్లా వాణి, రాజు కరణం మధు, మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు కంటి పాక త్రిమూర్తులు కొత్తలంక కనకరాజు పెంటయ్య ఏసుదాసు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రామతీర్థం దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలి : బీజేపీ, జనసేన నాయకుల డిమాండ్



చిత్తూరు ( జనస్వరం ) : రామతీర్థంలో శ్రీరాముల వారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. జై శ్రీరామ్ అంటూ నినదిస్తూ.. అలాగే రామతీర్థంలో జరిగిన జనసేన-బీజేపీ నాయకుల అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట జనసేన – బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తర్వాత అక్కడి నుండి గిరింపేటలో గల శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం వరకూ నిరసన పాదయాత్ర చేపట్టడం జరిగింది. జనసేన నాయకులు మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆ శాఖ మంత్రిగా వెల్లంపల్లి నైతిక బాధ్యత పాటిస్తూ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దగాకోరు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి, మీడియా ప్రతినిధి నిశిధా రాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి పుష్పలత, సుబ్రమణ్యం, యాదవ్, చిత్తూరుజిల్లా అధ్యక్షుడు మైందల రామచంద్రుడు, బీజేపీ నాయకులు పోతపాల రామమూర్తి, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, ఓబీసీ మోర్చా అట్లూరి శ్రీనివాసులు, యువ మోర్చా వికోట శివ రాయల్, రామభద్ర, తోటపాళ్యం వెంకటేష్, నక్కా రామచంద్ర, బ్రహ్మానందరెడ్డి కుమార్, జనసేన పార్టీ చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ పుంగనూరు నానబాల లోకేశ్వర (లోకేష్ రాయల్), పూతలపట్టు నియోజకవర్గ నాయకులు నరిగన్నగారి తులసీప్రసాద్ బిజెపి, జనసేన మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## రామతీర్థం ఘటనపై పెల్లుబికిన ప్రజాగ్రహం : చిత్తూరు జిల్లా మూడు మండలాలలో జనసేన, బీజేపీ నేతల నిరసనలు



చిత్తూరు ( జనస్వరం ) : రామతీర్థం క్షేత్రంలో దుండగులు శ్రీరామచంద్ర మూర్తి విగ్రహం తలనరికిన దుర్ఘటనకు, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పలు హిందూ దేవాలయాలలో విగ్రహాలు ధ్వంసంచేయడం వంటి, అంతర్వేదిలో రథం దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన, బీజేపీ నాయకులు శుక్రవారం పేర్కొని నిరసన వ్యక్తంచేశారు. హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆ శాఖ మంత్రిగా వెల్లంపల్లి నైతిక బాధ్యత పాటిస్తూ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దగాకోరు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. చేతకాని ప్రభుత్వం వెంటనే పాలన నుండి తప్పుకోవాలని ప్రజాగ్రహజ్వాలలు పెల్లుబికాయి. చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గ పరిధిలోని శాంతిపురం, కుప్పం, రామకుప్పం మండలాలలో జనసేన, బీజేపీ శ్రేణులు కదంతొక్కి రాష్ట్రప్రభుత్వంబాధ్యతారాహిత్యంగా,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. శాంతిపురం, కుప్పం, రామకుప్పం మండలాలలో జనసేనపార్టీ, బీజేపీపార్టీ నేతలు, కార్యకర్తలు, జనసైనికులు, ప్రజలతో కలసి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. . అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాలలో తహశీల్దార్ లకు, వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం గనుక తక్షణమే కళ్ళు తెరవకపోతే భవిష్యత్తులో తీవ్ర స్థాయిలో పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నాయకులు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో శాంతిపురం, కుప్పం, రామకుప్పం మండల కమిటీ సభ్యులతో పాటు పలువురు జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టా అర్హుల జాబితాలో అవకతవకలు జరిగాయని అధికారులకు విన్నవించిన జనసేన నాయకులు వబ్బిన జనార్ధన శ్రీకాంత్



పెందుర్తి ( జనస్వరం ) : విశాఖపట్నం జిల్లా 88 వార్డ్ నరవ గ్రామం విశాఖపట్నం జిల్లాలో జనసేన 88 వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి వబ్బిన జనార్ధన శ్రీకాంత్గారు YSR ఇళ్ల పట్టా అర్హుల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అర్హుల జాబితాలో ఇల్లు లేని బడుగు బలహీనవర్గాలని పక్కన పెట్టి ఎక్కువ శాతం YSRCP నాయకులు, బంధు ప్రీతి తో వారి బంధువులకు, పార్టీ జండా మోసే ధనవంతులకు అర్హులుగా ప్రకటించారని, వెంటనే అర్హుల జాబితాను మరొక్కసారి సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీ వ్యవస్థ తో సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు. నరవ గ్రామంలో ఉన్న అర్హులందరికీ ఇల్లు పట్టా జాబితాలో ప్రకటించాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ గారిని, జీవీఎంసీ కమిషనర్ గారిని, ZONE 5 కమిషనర్ గారిని, జిల్లా యంత్రాంగాన్ని, సచివాలయం సిబ్బందిని కోరడం జరిగింది. అలాగే ఉన్నతాధికారులకు వ్రాత పూర్వకంగా సమస్యను వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలోజనసేననాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆచంట నియోజకవర్గంలో జనసైనికుల ఆత్మీయ సమావేశం



ఆచంట ( జనస్వరం ) : ఆచంట నియోజకవర్గంలో1800 క్రియాశీలకసభ్యత్వాలు నమోదు చేయడంతో జనసేన పార్టీ కార్యకర్తల అభినందన సభను ఆచంట మండలం పెదమల్లం గ్రామం వద్ద నున్న మసేనమ్మ తల్లి గుడి వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. జనసేన నాయకులు మాట్లాడుతూ రాజకీయం డబ్బుతో ముడిపడిన వ్యవస్థ అని రాజకీయలవైపు కన్నెత్తి చూడలంటేనే భయపడేవారిని సైతం ఎంతో మంది యువకులకు అవకాశం కల్పించిన పార్టీ జనసేన అని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటేయువతలోప్రశ్నించేతత్వంరావాలని అప్పుడే అవినీతి జరగకుండా పారదర్శకంగా అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతాయని తెలిపారు. నేటి వ్యవస్థ మార్పుకోసం జరుగుతున్న ఉద్యమాల్లో యువతరమే సింహాభాగంగా సాగుతుందని భావి భారత నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని గుర్తుచేశారు. దేశానికి యువత ప్రధాన సంపద బలమైన ఆయుధం లాంటి వారని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అని అన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుగా స్పందించి పరిష్కారం చెప్పేది ఒక్క జనసేన మాత్రమే అని ఆయన అన్నారు. చేగోడీ సూర్యప్రకాష్ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కనకరాజు సూరి గారు, కొటికలపూడి గోవింద్ (చినబాబు) గారు,అనుకుల రమేష్ గారు,కాట్నం విశాలి మరియు ఆచంట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో మానవత్వం చాటుకున్న జనసేన నాయకులు బాడిశ మురళీకృష్ణ



జగ్గయ్యపేట ( జనస్వరం ) : ప్రత్తి తీయడానికి కూలీలతో వస్తున్న ఆటో కంభంపాడు గ్రామానికి కిలోమీటర్ దూరంలో మునేటి కాలువ వద్ద ఆటో అదుపుతప్పి కాలువలో పడిపోవడం జరిగింది. ఈ ఘటనలో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బాడిశ మురళీకృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి భాదితులకు ప్రథమ చికిత్స అందించి వత్సవాయి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు.

## జనసేనపార్టీ, బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రామతీర్థం విగ్రహల ధ్వంసంపై పోలీసులు ధర్మయాత్రను అడ్డుకోవడంపై RDO గారికి వినతి పత్రం



విజయనగరం ( జనస్వరం ) : విజయనగరం జిల్లా రామతీర్థంలో గల విగ్రహాల ధ్వంసం ఘటనపై, జనసేన నాయకులపై, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సోము వీర్రాజు గారిపై దౌర్జన్యము చేయడం, జనసేన బిజెపి నాయకులు పై రామతీర్థం దర్మయాత్రను అడ్డుకోవడం, అక్కడికి వెళ్ళకుండ హౌస్ అరెస్ట్ లు చేసి పోలీసులు కార్యకర్తలను, నాయకులను అడ్డుకోవడంపట్ల గురువారం 11 గంటల నుండి రామచంద్రపురం పట్టణము మున్సిపల్ ఆఫీసు దగ్గర నుండి కాలినడకన బయలుదేరి RDO ఆఫీసు దగ్గరకు వెళ్లి వినతిపత్రం అందజేయడం జరిగింది. జనసేన నాయకులు మాట్లాడుతూ శ్రీరామచంద్ర మూర్తి విగ్రహం తలనరికిన దుర్ఘటనకు, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పలు హిందూ దేవాలయాలలో విగ్రహాలు ధ్వంసంచేయడం వంటి, అంతర్వేదిలో రథం దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన, బీజేపీ నాయకులు శుక్రవారం పేర్కొని నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం తూర్పు గోదావరి జిల్లా బిజెపి ప్రదాన కార్యదర్శి ఇళ్ళ వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్ గారు, బిజెపి నాయకులు కర్రిచిట్టిబాబు గారు, దూడల శంకరనారాయణ గారు, జనసేన నాయకులు నారపురెడ్డి పార్థసారథి గారు, బుంగారాజు గారు , కోట శ్రీనివాసరావు గారు, గొల్లపల్లి క్రిష్ణ గారు, అక్కిరెడ్డి శ్రీను, అంకం శ్రీను, కంచెర్ల వెంకటేశ్వరరావు, దిగుమర్తి రాము, అనిశెట్టి బాబ్జీ, సంపత్, మిధిల్, రాంబాబు నాయుడు, క్రిష్ణ చైతన్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## బాబాసాహెబ్ అంబేడ్కర్ సాక్షిగా..మహిళల రోదనతో చలించిన శ్రీ పవన్ కల్యాణ్ గారు



న్యూస్ ( జనస్వరం ) : కొత్త పాకలు గ్రామ మహిళల రోదన జనసేన అధ్యక్షుడు శ్రీ పవన్ కళ్యాణ్ గారిని కదిలించింది. ఒకరి వెంట ఒకరు తాము పడుతున్న కష్టాలను, ఎదుర్కొంటున్న అవమానాలను వివరిస్తుంటే చలించిపోయారు జనసేనాని. తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం కొత్తపాకలు గ్రామంలోకి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అడుగిడగానే అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాల వేశారు. అదే ప్రాంతంలో పోలీసులు బీభత్సం సృష్టించారని, 160 మందిపై కేసులు పెట్టారని, 36 మంది ఇంకా జైలులోనే మగ్గుతున్నారని ఆ ప్రాంత మహిళలు వివరించారు. ఆ క్రమంలో తమకు న్యాయం జరిగేలా చూడాలంటూ అంబేడ్కర్ కు వేసిన దండను పోలీసులు తొలగించి అపచారానికి పాల్పడ్డారని విలపించారు. తమను గాయపరచారంటూ గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీమతి మరియ అనే మహిళ మాట్లాడుతూ తన భర్త అక్కడ లేకపోయినా అన్యాయంగా అరెస్టు చేసి నాన్ బెయిలబుల్ కేసు పెట్టారనీ, ఇప్పటికీ జైలులోనే ఉంచారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. “నన్ను కూడా కొట్టి, పోలీసు స్టేషన్ కు తీసుకెళ్లారు. జనసేన నేతలు నన్ను విడిపించారు. రోజువారీ కూలి చేసుకునే తన భర్త జైలు పాలు కావడంతో కూతుళ్లను తానెలా పోషించాలి” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో అవమానాలు పడ్డాము, భయభయంగా బతుకుతున్నాము అని వివరించారు. మాకీ పరిశ్రమ వద్దంటూ రోదించారు. మరో వృద్ధురాలు మాట్లాడుతూ నా కొడుకును తీసుకెళ్లారు.. ఎప్పుడొస్తాడో తెలియదు” అని కన్నీటి పర్యంతమయ్యారు. ఆ ప్రాంత మహిళల వేదనకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు చలించిపోయారు మనసు కూడతీసుకొని ఇక్కడి ఆడపడుచుల వేదన మనసును కదిలించిందని అన్నారు. ధైర్యంగా ఉండండి....అన్ని విధాలా అండగా ఉంటాం అని ఓదార్చారు.

## స్థాయికి తగని మాటలు తగవు - శ్రీ పవన్ కళ్యాణ్ గారు...



న్యూస్ ( జనస్వరం ) : ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 100కు పైగా దేవాలయాలపై గత రెండేళ్ల కాలంలో దాడులు జరిగాయి. రథాలు దగ్ధాలు, దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసమయ్యాయి. జరుగుతున్న ఈ ఆరాచకంపై మాట్లాడితే “ప్రతిపక్షాలు ఈ రాష్ట్రంలో రాజకీయ గెరిల్లా వార్ ఫేర్ నడిపిస్తున్నాయి” అని ముఖ్యమంత్రి శ్రీ జగన్ రెడ్డి గారు చెప్పడం బాధ్యత నుంచి తప్పించుకునే విధంగా ఉంది. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న మీరు ఆధారాలు లేకుండా మాట్లాడితే ప్రజలు హర్షించరు. మీరు ఎంతటి శక్తిమంతులో ఈ దేశ ప్రజలందరికి తెలుసు. మీరు ఒక్క లేఖ రాస్తే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు క్షణంలో బదిలీ అయిపోతారు. అంతటి శక్తి ఉన్న మీపై గెరిల్లా వార్ ఫేర్ చేయడానికి ఎవరు సాహసిస్తారు. 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు, 115 మంది ఐ.పి.ఎస్ లు, మరో 115 మంది అదనపు ఎస్.పి.లు వేలాది మంది పోలీసు సిబ్బంది మీ చేతుల్లో ఉండగా విగ్రహాలను ధ్వంసం చేసే వారిని పట్టుకోలేకపోవడం విడ్డూరంగా ఉంది. నిస్సహాయుడైన డాక్టర్ సుధాకర్ గారి పైన, సోషల్ మీడియాలో మీపైన, మీ పార్టీ వారిపైన పోస్టులు పెట్టేవారిపై అత్యుత్సాహంతో కేసులు పెట్టే పోలీసులు దేవుడి విగ్రహాలను ధ్వంసం చేసేవారిని పట్టుకుని ఎందుకు కేసులు పెట్టలేకపోతున్నారు. ఊరికో వాలంటీరు చొప్పున 2.60 లక్షల మందిని నియమించారు కదా .. వారు కూడా సమాచారం ఇవ్వలేకపోతున్నారా? ఎక్కడ వుంది లోపం? మీలోనా? మీ నీడలో వున్న వ్యవస్థలోనా? పైగా ప్రతిపక్షాలు అన్నింటినీ ఒకే గాటన కట్టి దుష్ప్రచారం చేస్తున్నారని మీరు చెప్పడం ‘ఆడలేక మద్దెలు ఓడు’ అన్నట్లు ఉంది. గత రెండేళ్లుగా సహనంతో ఉన్న పీఠాధిపతులు సైతం రోడ్డుపైకి రావలసిన పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది.ఇకనైనా ఇటువంటి మాటలు కట్టిపెట్టి దోషులను పట్టుకుని, వారిని ప్రజల ముందు నిలబెట్టే పనిలో ఉంటే మంచిది అని పవన్ కళ్యాణ్ గారు అన్నారు.

## గ్రామాల్లోని సమస్యల మీద కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ : బండారు శ్రీనివాస్




కొత్తపేట ( జనస్వరం ) : తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేట నియోజక వర్గంలో ఉన్న జనసేన కార్యకర్తలతో ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరియు వాట్సాప్ వీడియో ద్వారా గ్రామాల్లో ఉన్న, మండలాల్లో ఉన్న ప్రజా సమస్యల పైన, కార్యకర్తలతో చర్చించి, గ్రామాల్లో ఉన్న జనసైనికులకు ముఖ్యమైన సూచనలు సలహాలను ఇస్తూ, ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే నిరంతరము సమస్యల మీద స్పందించాలని, గ్రామాల్లో ఉన్న అపరిష్కృతంగా ఉన్న సమస్యల మీద వెంటనే స్పందించి నివేదిక ఇస్తే, పై అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ఏ ఒక్కరు కూడా అశ్రద్ధ చేయకూడదు అని, నిరంతరం ప్రజలకు ముఖ్యమైన నాయకులు కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారికి సూచనలు సలహాలు ఇస్తూ, ముఖ్య జన సైనికులకు కార్యకర్తలకు, బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ,, సమస్యల మీద ప్రతి ఒక్కరు స్పందించాలని కోరారు. ప్రతి ఒక్కరికి సమస్య వచ్చినపుడు ప్రశ్నించే మనస్తత్వం ఉండాలని, జనసేన పార్టీ, జన సేనాని ముఖ్య ఉద్దేశమని, ప్రతి ఒక్కరు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, గ్రామంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని, కార్యకర్తలకు బండారు శ్రీనివాస్, పలు సూచనలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేశారు.

## కుట్టు బట్టలు పంపిణీ చేసిన జనసేన నాయకులు, మెగా అభిమానులు : రాహుల్ సాగర్



ఎమ్మిగనూరు ( జనస్వరం ) : గోనెగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాత్రి పూట వాచ్ మెన్ గా పనిచేస్తున్న రామకృష్ణకు మెగా ఫ్యాన్స్ తాలూకా అధ్యక్షులు రాహుల్ సాగర్ ప్రధాన ఉపాధ్యాయులు అయ్య స్వాములు చేతులమీదుగా బుధవారం రోజు వాచ్ మెన్ కు యూనిఫామ్ కుట్టు బట్టలను అందించారు,ఈ సందర్భంగా ప్రధాన ఉపాద్యాయులు అయ్య స్వాములు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు పనులతో తమ పాఠశాలకు పూర్వవైభవం వస్తుందని తెలిపారు, అందులో భాగంగానే పాఠశాలకు రాత్రి పూట వాచ్ మెన్ అవసరం అని భావించి నియమించడం జరిగిందని అన్నారు, వాచ్ మెన్ గా విధులు నిర్వహించే రామకృష్ణ కు బయటి వ్యక్తులు గుర్తించేలా యూనిఫామ్ ను కుట్టించి ఇచ్చిన మెగాఫ్యాన్స్ సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో మెగాఫ్యాన్స్ మండల అధ్యక్షులు మాలిక్, చాంద్, పాల్గొన్నారు.

## దివ్యాంగులకు న్యాయం చేయాలి_ _ _ నిరహారదీక్షకు జనసేన సంఘీభావం




మండపేట ( జనస్వరం ) : అన్ని సక్రమంగా ఉన్న వారికి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులు విషయంలోనూ ఉదారంగా స్పందించి ఆదుకోవాలని జనసేన అధికార ప్రతినిధి శెట్టి రవి డిమాండ్ చేశారు. ఉండటానికి గూడు లేక ఎంతో కాలంగా నిరాశ్రయులుగా కాలం వెళ్లదీస్తున్న దివ్యాంగులు తమకు ప్రభుత్వం నివాస యోగ్యం కల్పించాలని రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. మండపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద వికలాంగులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. వికలాంగుల విషయంలో నిబంధనలు పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ మానవత్వం తో స్పందించాలని కోరారు. ఇళ్లు లేక నిరాధారంతో బతుకుతున్న దివ్యాంగులను ప్రభుత్వం ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం తరపున రావల్సిన సంక్షేమ పథకాలు అందివ్వాలని కోరారు.

## రైల్వేకోడూరు లో జనసైనికుల ఆత్మీయ సమావేశం




రైల్వేకోడూరు ( జనస్వరం ) : రైల్వేకోడూరు నియోజకవర్గ స్థాయి జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకుడు గంధం శెట్టి దినకర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా దినకర్ బాబు మాట్లాడుతూ మనసా, వాచా, కర్మణ జనసేన పార్టీ కోసం పనిచేసే జన సైనికులందరు ఏకతాటిపైకి వచ్చి , బహుజనులను కలుపుకు పోతూ ప్రజలలో పార్టీ సిద్ధాంతాలను జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. రాజకీయ చైతన్యం లేనిదే రాజ్యాధికారం సాధించలేరని తెలిపారు. పార్టీ బలపడాలి అంటే రాజకీయ పరిణతి మేధస్సు వాక్చాతుర్యంతో పాటు నిస్వార్థంగా పని చేసే నాయకులు యువ కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలపై వివరిస్తూ అధికార ప్రతిపక్షాలు ప్రజల మనోభావాలపై సంబంధం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మూడవ ప్రత్యామ్నాయంగా జనసేన పార్టీ ప్రజల్లోకి బలంగా దూసుకుపోతుందని అందుకోసం ప్రతి కార్యకర్త చీమల దండుల నిబద్ధతతో క్రమశిక్షణతో నిలకడగా ఓర్పుతో హంగు ఆర్భాటం లేకుండా సంఘీభావంతో పనిచేయాలని కోరారు.

## జనసేన ప్రెస్ నోట్స్

ప్రశ్నిస్తాం. వాయు, జల కాలుష్యాలు ఎంత ప్రమాదకరమో ఏలూరు దుర్ఘటన ద్వారా అందరికీ అవగతమైంది. ఎంతో మంది పిల్లలు, పెద్దవారు ఆస్పత్రిలో చికిత్స పొందాల్సి రావడం చూశాం. ఈ రోజుకీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఎందుకు అస్వస్థతకు గురయ్యారో గుర్తించలేక పోయింది. రాత్ గయే... బాత్ గయే అని వదిలేశారు. జనసేన మాత్రం అలా వదిలేయదు. ఈ ప్రాంతంలో దివీస్ పరిశ్రమ ఏర్పాటు అయితే అది రోజుకు 65 లక్షల లీటర్ల మంచినీటిని వినియోగించి 55 లక్షల లీటర్ల నీటిని కలుషితం చేసి సముద్రంలో కలుపుతుంది. తుని పట్టణ అవసరాలకు రోజుకు 45 లక్షల లీటర్ల నీరు అవసరమవుతాయి. అంటే దీనికంటే 10 లక్షల లీటర్ల నీటిని దివీస్ ఫార్మా కలుషితం చేస్తుందన్న మాట. జల కాలుష్యం కంటికి కనిపించడం లేదని నిర్లక్ష్యం చేస్తే వాయు కాలుష్యంలానే ప్రాణం తీస్తుంది. సముద్రంలో జలచరాలను చంపేస్తుంది. మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. సముద్రంలో మత్స్య సంపద పెరగాలని వేట నిషేధ సమయంలో కడుపుకాల్చుకొని మరీ ఉంటారు మత్స్యకారులు. ప్రకృతిని అర్థం చేసుకొని జీవనం సాగిస్తారు. వాళ్లకు ఉన్న పర్యావరణ స్పృహ కూడా మన ప్రజాప్రతినిధులకు, మంత్రులకు లేకుండా పోయింది. లోక జ్ఞానం అంటే డిగ్రీలు, పీజీలు, అవార్డులు తీసుకుంటే వచ్చేది కాదు. ప్రకృతిని అర్థం చేసుకుంటే వచ్చేది.

ఆకాశానికి రాకెట్లు పంపిస్తున్నాం. మార్సులో అడుగు పెట్టాలని చూస్తున్నాం. భారతదేశం నుంచి సున్నాను ఇచ్చామని, ఖగోళ శాస్త్రం గురించి ముందే తెలుసని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ రసాయన వ్యర్థాలను వంద శాతం శుద్ధి చేసే టెక్నాలజీని మాత్రం మన దేశంలో తీసుకురాలేక పోతున్నాం. గొప్ప గొప్ప మేధావులు మన దగ్గర ఉన్నారు. వారి సేవలను వినియోగించుకోలేకపోతున్నాం. పాశ్చత్య దేశాల్లో వ్యర్థజలాలను శుద్ధి చేసే టెక్నాలజీ ఉంది. భారీ ఖర్చుతో కూడుకున్నది కనుక మన దగ్గర వాడటానికి సిద్ధంగా లేరు. ఇక్కడ రాబోతున్న పరిశ్రమ షేర్ వాల్యూ రూ. 3 వేలకు పైమాటే. ప్రజల కన్నీరుపై తమ ఎదుగుదల ఉండకూడదని ప్రతి పరిశ్రమ గుర్తించాలి. లాభాల వేటలో పడి అన్ని పరిశ్రమలు విలువలను వదిలేస్తున్నాయి. రసాయన వ్యర్థాలను సముద్రంలో కలిపేస్తాం, భూమిలో కలిపేస్తాం అంటే జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదు. కచ్చితంగా వారికి విలువలు నేర్పిస్తాం.

### పర్మిషన్ ఇచ్చేటప్పుడే ఆలోచించుకోవాలి :

ఈ ప్రాంతంలో పరిశ్రమ పెట్టడానికి దివీస్ పరిశ్రమ 489 ఎకరాలు కావాలని ప్రభుత్వాన్ని కోరింది. అందులో 150 ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటు చేస్తాం. మిగిలిన 350 ఎకరాలు భవిష్యత్తులో విస్తరణకు అని చెప్పారు. ఇప్పుడు 489 ఎకరాలు కాస్త 690 ఎకరాలు అయ్యింది. పరిశ్రమ రూ. 600 కోట్లు పెట్టుబడి పెడితే ప్రభుత్వం 690 ఎకరాలు కేటాయించింది. పోనీ వేలకొలది ఉద్యోగాలు వస్తాయి అనుకుంటే అది పొరపాటే. 15 వందల శాశ్వత ఉద్యోగాలు, ఇంకో 15 వందలు టెంపరరీ ఉద్యోగాలు. మొత్తం తిప్పికొడితే 3వేల ఉద్యోగాలు కూడా లేవు. కేవలం 15 వందల ఉద్యోగాల కోసం భూమి ఫ్రీగా ఇచ్చి, పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి ఇచ్చేటట్లు ఒప్పందాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 200కు పైగా ఉన్న హేచరీస్ పై 45 వేల మంది ఉపాధి పొందుతున్నారు. నెలకు రూ. 20 వేలకు పైగా సంపాదిస్తున్నారు. అలాంటి హేచరీస్ ను ధ్వంసం చేసి ఇలాంటి పరిశ్రమలకు పర్మిషన్ ఇవ్వడం ఎంత వరకు సబబో ప్రభుత్వమే ఆలోచించుకోవాలి.

### ప్రజల ఆరోగ్యంతో ఆటలొద్దు :

పరిశ్రమ కోసం భూములు కావాలంటే ముందు సామాజిక ప్రభావం అంచనా వేయాలి. ఈ ప్రాంతంలో ఏ ఏ కులాలు ఉన్నాయి. ఎలాంటి ఉపాధి పొందుతున్నారు. ఎంత సంపాదిస్తారు. భూములు లాక్కుంటే ఎంత ఇవ్వాలి అని ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్లు లెక్కకడతారు. దివీస్ కంపెనీకి వైసీపీ నాయకులకు చెందిన రాంకీ కంపెనీ వాళ్లే ఈ నివేదిక ఇచ్చారు. ఇది పిల్లికి ఎలుక సాక్ష్యం లాంటిదే ఇలాంటి కంపెనీలు మన దేశంలోనే పెట్టడానికి చాలా కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది పర్యావరణ చట్టాలు కఠినంగా లేకపోవడం. 1984లో భోపాల్ గ్యాస్ విధ్వంసం జరిగింది. ముక్కుపచ్చలారని ఎందరో పసిపిల్లలు చనిపోయారు. దాని తర్వాత 1994 వరకు పర్యావరణ చట్టాలు తీసుకు రాలేదు. పర్యావరణ శాఖ ఏం చేస్తుందో, పొల్యూషన్ బోర్డు ఏం చేస్తుందో సమాధానం చెప్పాలి. పరిశ్రమల శాఖ మంత్రి గౌతమ్ రెడ్డి గారిని మేము ఒకటే అడుగుతున్నాం. ఈ పరిశ్రమ నుంచి ఎలాంటి కాలుష్యం బయటకు రాదని సైంటిఫిక్ గా నిరూపిస్తే పరిశ్రమ ఏర్పాటుకు జనసేన అడ్డురాదు. అలాగే సర్టిఫికేట్లు ఇచ్చిన రాంకీ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్లు గర్భిణులకు గర్భస్రావం కాదని, ఎవరికీ చర్మవాధులు, శ్వాసకోశ వ్యాధులు రావని సైంటిఫిక్ గా నిరూపించే బాధ్యత తీసుకోవాలి. పరిశ్రమల్లో వాటాలు పెట్టుకొని వాటికి పర్మిషన్లు ఇచ్చి ప్రజారోగ్యంతో చెలగాటం ఆడాలని చూస్తే మాత్రం జనసేన దానికి వ్యతిరేకం.

### కోడి కత్తితో పొడిచిన వాళ్ళు... పొడిపించుకున్న వాళ్ళు బాగానే ఉన్నారు :

తమ పొలాల్లోకి వెళ్లినందుకు 160 మందిపై కేసులు పెట్టారు. 36 మంది ఇప్పటికీ జైల్లో మగ్గిపోతున్నారు. ఈ గ్రామీణులు సూట్ కేసు కంపెనీలు పెట్టి అవినీతికి పాల్పడలేదు. హ్యతలు, దోపిడీలు చేయలేదు. కోడి కత్తితో పొడవలేదు. కోడి కత్తితో పొడిచినోళ్లు, పొడిపించుకున్నోళ్లు బాగానే ఉన్నారు. కానీ భూమి కోసం పోరాటం చేసినోళ్లు మాత్రం జైల్లో మగ్గిపోతున్నారు. గౌతమ్ రెడ్డిగారు పెద్ద మనసు చేసుకొని వారిని బేషరతుగా విడుదల చేయాలి. వైసీపీ నాయకుల్లాగా దిగజారి మాట్లాడటం మనకు రాదు. తల్లిదండ్రులు సంస్కారం నేర్పించారు. మనం గౌరవ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారు అని పిలిస్తే.. వాళ్లు మనల్ని ఎలా తిడతారో కాకినాడ వైసీపీ ఎమ్మెల్యే మాటలు వింటే తెలుస్తుంది. మనం తిరిగి ఒక మాట అనడానికి ఎంతోసేపు పట్టదు. రోడ్ల మీదకు వచ్చి ఎదురుదాడి చేయలేక కాదు. గొడవలు, దౌర్జన్యాల కోసం రాజకీయాల్లోకి రాలేదు. మార్పు తీసుకురావడానికి రాజకీయాల్లోకి వచ్చాం.

### పోలీసుల మీద కాదు వ్యవస్థల్ని శాసించే వారి మీదే కోపం :

సభకు పర్మిషన్ ఇచ్చే విషయంలో చాలా హైడ్రామా నడిచింది. వారం ముందు పర్మిషన్ ఇచ్చాం అని చెప్పి, నిన్న సాయంత్రం అనుమతులు లేవని చెప్పారు. నాకు పోలీసుల మీద కోపం లేదు. వాళ్ల బాసులు ఏం చెబుతారో వాళ్లు అదే చేస్తారు. నన్ను అమరావతిలో నెట్టేసే పరిస్థితి వచ్చినా నాకు వారి మీద కోపం రాలేదు. నా కోపం వ్యవస్థల్ని శాసించే వ్యక్తుల మీద తప్ప పోలీసుల మీద కాదు. పర్మిషన్ ఇవ్వకపోయినా నడుచుకుంటూ అయినా వస్తాం. పదవిలోకి వస్తే బంగాళాఖాతంలో కలిసేస్తాం.... పదవిలోకి వచ్చాక పర్మిషన్లు ఇస్తాం అనే మాయ మాటలు జనసేన చెప్పదు. ఒక పరిశ్రమ ఉండాలంటే ఎలాంటి విధానాలు ఉండాలి, కాలుష్యం ఎంత వెదజల్లుతుంది వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని పర్మిషన్ ఇస్తాం. విధ్వంసం స్థాయి ఎక్కువగా ఉంటే మాత్రం పరిశ్రమ మాకు వద్దు వెళ్లిపోండని మొహమాటం లేకుండా చెప్పేస్తాం. ఏ పరిశ్రమ అయినా చట్టాలకు లోబడే ఉండాలి. దివీస్ పరిశ్రమపై నాకు ఎలాంటి కోపం లేదు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి నష్టం కలగదని ఆ పరిశ్రమ నిరూపించుకోవాలని అన్నారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం పరిశ్రమను ఇక్కడ నుంచి తరలించాలి. లేనిపక్షంలో బాధితుల తరఫున పోరాటం చేయడానికి జనసేన వెనుకాడద"ని జనసేనాని హెచ్చరించారు.

### జగన్ రెడ్డి గారిది రెండు నాల్కల ధోరణి: శ్రీ నాదెండ్ల మనోహర్ గారు :

ఎన్నికలకు ముందు దివీస్ ఫార్మా ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన శ్రీ జగన్ రెడ్డి గారు తీరా ముఖ్యమంత్రి అయ్యాక ఎందుకు వెనక్కు తగ్గారో ప్రజలు ఒకసారి ఆలోచించాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు కోరారు. ఆనాడు ఓట్ల కోసం మభ్యపెట్టి పదవి వచ్చిన తరువాత మారిపోయిన వ్యక్తి ఈ జగన్ రెడ్డి. ఆ రోజు దివీస్ పై నిప్పులు చెరిగిన వ్యక్తి ఈ రోజు ఇంతగా ఏ కారణాల వల్ల మారిపోయారు? ఈయనేనా ప్రజానేత అంటూ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులంటే నిజాయతీ, నిలకడ ఉండాలి. ఈ ముఖ్యమంత్రికి నిలకడ లేదు. ఉన్నదంతా రెండు నాల్కల ధోరణే. ఆనాటి శ్రీ జగన్ రెడ్డి ప్రసంగాన్ని అవలోకం చేసుకుంటే ఆయన ఉపన్యాసం అభివృద్ధి కోసమా.... ఓట్ల కోసమా అనేది ఇట్టే అర్థమవుతుంది. అభివృద్ధిని అందరం ఆహ్వానించాల్సిందే.... కాని పర్యావరణాన్ని ధ్వంసం చేసి కాదు. ఇదే జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు బలంగా నమ్మే సిద్ధాంతం. కాలుష్యం నుంచి కాపాడంటూ ఉద్యమం చేస్తున్న వారిలో 160 మందిపై కేసులు పెట్టారు. ఇంకా 36 మంది జైలులోనే మగ్గుతున్నారు. మహిళలపై లాఠీచార్జ్ చేశారు. ఇంత జరుగుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎందుకు ముఖం చాటేస్తున్నారు? ఇక్కడ ఈ సభను అడ్డుకోవడానికి ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసింది. జిల్లా ఎస్పీపై విపరీతమైన వత్తిడి తెచ్చింది. అయినా అనుమతులిచ్చిన ఎస్పీ గారికి, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు.

## జనసైనిక్ పంచ్

**రాజేష్ ( జనసైనికుడు )**

» రాష్ట్రం అనతి కాలంలోనే 3 లక్షల కోట్లకు చేరిందని అంచనా... అప్పు ఉన్న స్థాయిలోనే ఆదాయం కూడా లేకపోవడం విచారర్ధకం.

» సంక్షేమ పథకాలు ప్రజల అవసరానికి ఇవ్వాలి గానీ, ప్రజలను సోమరిపోతుల్లా చేసేలాగా పథకాలు అందించకూడదు.

» రాష్ట్రం అభివృద్ధి చెందింది అంటే ఆ రాష్ట్ర ఆదాయం, అక్షరాస్యత, వైద్య సదుపాయాలు, విద్యా వ్యవస్థ తదితర బలంగా ఉంటేనే ఎదిగినట్టు. ఇవన్నీ ఆంధ్ర రాష్ట్రంలో లేకపోవడం బాధాకరం.

ఆరంభంలో రూ.390 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ప్రారంభిస్తున్నామని 1300 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పిన దివీస్ ఇప్పటి లెక్కలు వేరేగా ఉన్నాయి. రూ.1500 కోట్ల పెట్టుబడి, 6000 మందికి ఉపాధి అంటున్నారు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే అని కొత్త ప్రచారం మొదలు పెట్టారు. విచిత్రమేమిటంటే ఇక్కడ చదువుకున్న వారి శాతం 12కి మించి లేదు. పైపెచ్చు ఆ పరిశ్రమకు అవసరమైన మెకానికల్ ఇంజినీర్లు, కెమిస్టులు, ఫార్మాసిస్టులు ఇక్కడ ఉన్నారా? ఎందుకీ మభ్య పెట్టే మాటలు? వీటన్నింటిపై పాలకులను నిలదీయాల్సిన బాధ్యత మీతోపాటు మా మీద కూడా ఉంది. అందుకే ఇక్కడకు వచ్చాం. రెచ్చగొట్టడానికో....ఓట్ల కోసమో కాదు. ముఖ్యమంత్రి స్పందించేవరకు ఉద్యమిద్దాం. మీకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ మీ వెంట నిలబడుతుంద"ని శ్రీ మనోహర్ గారు హామీ ఇచ్చారు.

### ఇలాంటి అభివృద్ధి మాకొద్దు....

అంతకు ముందు పలువురు రైతులు, మత్స్యకారులు, హేచరీస్ వారు మాట్లాడుతూ శ్రీ జగన్ రెడ్డి గారు ఎన్నికలకు ముందు ఇక్కడకు వచ్చి చేసిన ప్రసంగాన్ని నమ్మి ఆ పార్టీకి మెజార్టీ ఇచ్చాం. ఇప్పుడు మడమ తిప్పి మమ్మల్ని ముప్పతిప్పలు పెడుతున్నారు. ఇక్కడ 220 హేచరీలు ఉన్నాయి. దాదాపు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఇప్పుడిప్పుడే పిల్లల్ని బాగా చదివించుకోగలుగుతున్నాం. మాకు ఇది చాలు. మా బతుకు మమ్మల్ని బతకనీయండి. కాలుష్యం బారిన పడేసే అభివృద్ధి మాకు వద్దు అంటూ కళ్లనీళ్ల పర్యంతమయ్యారు. జైలులో ఉన్న 36 మంది విడుదలకు కృషి చేయాలని కోరారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారితో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం కొత్తపాకలు గ్రామంలోకి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అడుగిడగానే అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాల వేశారు. అదే ప్రాంతంలో పోలీసులు బీభత్సం సృష్టించారని, 160 మందిపై కేసులు పెట్టారని, 36 మంది ఇంకా జైలులోనే మగ్గుతున్నారని ఆ ప్రాంత మహిళలు వివరించారు.

## ప్రశ్నార్థకంగా మారిన భవన నిర్మాణ కార్మికుల జీవితాలు : జనసేన నాయకులు పత్తి సురేష్ ఆవేదన




బనగానపల్లే ( జనస్వరం ) : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసే దాని పైన ఉన్న శ్రద్ధ అభివృద్ధి పైన కొరవడిందని కర్నూలు జిల్లా బనగానపల్లే నియోజకవర్గ జనసేన నాయకులు పత్తి సురేష్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోసురేష్మాట్లాడుతూరాష్ట్రప్రభుత్వం వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో అభివృద్ధిని విస్మరించారని ఇసుక కొరతతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కొత్త పాలసీ తో పేద మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని టిప్పర్ 50 , ట్రాక్టర్ 10 వేలు ఇసుక ఉండటంతో పేద మధ్యతరగతి ప్రజలు ఇల్లు నిర్మించుకోవాలంటే హడలిపోతున్నారని ఆవేదన చెందారు. భవన నిర్మాణ కార్మికులతోపాటు నిర్మాణ రంగంపై ఆధారపడిన ముప్పై వ్యవస్థలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక కొరతపై స్పందించి వెంటనే పరిష్కరించకపోతే జనసేన ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుర్రప్ప, బోదనం ఓబులేసు, నాగప్రసాద్, కిట్టు, భాను, అశోక్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాలపై దాడులు అప్రజాస్వామికం. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోంది : జనసేన నాయకులు దేవర మనోహర్



చంద్రగిరి ( జనస్వరం ) : రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న వరుస దాడులను ఖండిస్తూ చంద్రగిరిలో జనసేన, బిజెపి నేతలు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జనసేన, బిజెపి నాయకులు సంయుక్తంగా భారీర్యాలీ నిర్వహించి తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. చంద్రగిరిలోని శ్రీ కోదండ రామాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసనలతో హోరెత్తించారు. బైబిల్ ప్రభుత్వం వద్దు, హిందూ ప్రభుత్వం ముద్దు అంటూ నినదాలు చేశారు. భారత్ మాతాకి జై... హిందువుల వ్యతిరేక ప్రభుత్వం నశించాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవర మనోహర్, పురుషోత్తం నాయుడు ఇద్దరూ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా మిత్రపక్షమైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న దేవాలయాలపై దాడులకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు. జనసేనపార్టీ నాయకుల పట్ల, బిజెపి నాయకుల పట్ల పోలీసుల వైఖరి హేయమైనదని, అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. మంత్రి వెల్లంపల్లి వెంటనే రాజీనామా చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దేవాలయాలపై వరుసగా దాడులు జరుగుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్కరినీ అరెస్ట్ చేయకపోవడం ఎంతో శోచనీయమన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వ ఉదాశీన వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రప్రభుత్వంయొక్కవైఫల్యాలను తూర్పారబట్టారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందని ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడుతారని పేర్కొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న అంబాజీపేట సరస్వతికి రూ. 30 వేల సాయం అందించిన గల్ఫ్ సేన జనసేన




తూర్పు గోదావరి ( జనస్వరం ) : గల్ఫ్ ఎన్ఆర్ఐ జనసేన, రాజకీయాలకు అతీతంగా సామాన్యుల క్షేమం కోరి, పదవులుకన్నా పేదవాడి సంక్షేమం మిన్న అన్న నినాదంతో గల్ఫ్ సేన జనసేన ఆధ్వర్యంలో 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం దిగుమర్తి సరస్వతి ప్రసాద్ రావుకు అందజేసారు. ఆమె కడుపులో కంతులు ఏర్పడి చాలా భాధపడుతూ ఆర్ధికంగా ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి ఎన్నార్ఐ నాయకులకు అందించిన సమాచారం ప్రకారం, కష్టాలను కష్ట నష్టాలను తెలుసుకున్నారు. గల్ఫ్ దేశాలు ఐన ఆరు దేశాలకు చెందిన గల్ఫ్ జనసేన వేదిక కు చెందిన తెలుగు ఎన్ఆర్ఐ ఉద్యోగ మిత్రులు అంతా కలిసి ఒక ప్రవాహమై, వివిధ రూపాల్లో అనేకమందికి గత కొంత కాలంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. నిజంగా ఆ కుటుంబం ఎంతో ఆనందిస్తూ, గల్ఫ్ జనసేన సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆ కుటుంబం తెలిపారు. ఈ మధ్యకాలంలో కరోనా మహమ్మారి కొరకు లాక్ డౌన్ లో, గోదావరి వరద ఉధృతి లోనూ, ఎంతోమందికి ఎన్నో రకాలుగా ఆదుకుంటూ, పలుసేవా కార్యక్రమాలు దేశవిదేశాల్లో కష్టాల్లో ఉన్న తెలుగు వారి పాలిట కల్పవృక్షమై విరాజిల్లుతున్న గల్ఫ్ జనసేనను గ్రామస్తులు మరియు సోషల్ మీడియా వేదికగా అభినందిస్తున్నారు.

## విశాఖ 60వ వార్డ్ PRG గ్రూప్ ఆధ్వర్యంలో జనసేన కప్ క్రికెట్ టోర్నమెంట్. పోస్టర్, టీ షర్ట్ విడుదల



విశాఖపట్నం ( జనస్వరం ) : విశాఖ పశ్చిమ నియోజకవర్గం 60వ వార్డ్ PRG గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 13,14,15వ తేదీలలో జనసేన కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడును. దానికి సంబంధించిన పోస్టర్ మరియు టీ-షర్ట్ ను ఈరోజు విశాఖ పశ్చిమ నియోజకవర్గం ముఖ్య నాయకులు శ్రీ పీలా రామకృష్ణ గారు, 60వ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ మొజ్జడ చంద్ర మౌళి గారు, 40వ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ కటంరెడ్డి శివ శంకర్ గారి చేతుకు మీదగా ఆవిష్కరించారు. అనంతరం 13న ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ యువతకు రాజకీయ కార్యక్రమాలతో పాటు ఆటలతో కూడా ఆనందాన్ని పంచాలని అనుకున్నాం అన్నారు. గురించి అవగాకార్యక్రమంలో PRG గ్రూప్ సభ్యులు అప్పారావు, మాత సత్తిబాబు, రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ సమస్యలపై టెక్కలి MPDO గారిని కలిసి వినతిపత్రం అందజేసిన టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ కణితి కిరణ్



టెక్కలి ( జనస్వరం ) : శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రాదా వల్లభాపురం గ్రామానికి సంబంధించిన కొంతమంది అర్హులైన వారికి పెన్షన్లు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వారికి పెన్షన్లు వచ్చేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ కోరారు. అలాగే మాదినవానిపేట గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరడమైంది. ప్రభుత్వ అధికారులు ఇటువంటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు ముడిదాన రాంప్రసాద్, అక్కువరం ఎంపీటీసీ అభ్యర్థి కొత్తూరు హరి, బగాది క్రాంతి, బొడ్డేపల్లి వెంకటేష్, ఎదురేసు చంటి తదితరులు పాల్గొన్నారు.

జన స్వరం
అక్షరమే ఆయుధం ✍
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైనవాణిని వినిపించాలనుకుంటున్నారా ? మీనియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా ? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా ? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900
janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl